

ఇన్‌చార్జి ఎంఈవోల నియామకం

గరుగుబిల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మక్కువ, గరుగుబిల్లి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమిస్తూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్‌భాస్కర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ రెండు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా సాలూరు నుంచి ఎం.రాజశేఖరరావు, బలిజిపేట నుంచి సామల సింహాచలంను నియమిస్తూ ఉత్తుర్వులిచ్చారు. ఇప్పటివరకు మక్కువ ఎంఈవోగా ఉన్న పి.సత్యనారాయణ గత నెల ఉద్యోగ విరమణ చేశారు. గరుగుబిల్లి ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న దత్తి అప్పలనాయుడును విజయనగరం డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్‌గా నియమించారు.

అక్రమాల లెక్క తేలేనా?

- వెలుగు శాఖలో చీకట్లు
- లబ్ధిదారులకు రుణాల పంపిణీలో అవకతవకలు
- కొందరు ఉద్యోగులు ఆ నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు
- కొన్నాళ్లుగా విచారణ పేరుతో కాలయాపన
- రికవరీకి ఆదేశాలిచ్చినా అమలు చేయని వైనం
- తాజాగా డీఆర్‌డీఏలో ఆ శాఖ విలీనం
- ఇకనైనా చర్యలు ఉంటాయా?





పార్వతీపురం, జూన్19(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని వెలుగు శాఖలో అక్రమాలపై చర్యలు కొరవడ్డాయి. మొత్తంగా ఎనిమిది క్లస్టర్లలో నిధులు స్వాహా అయినట్లు ఆరోపణలున్నా.. బాధ్యుల నుంచి రికవరీ చేయడం లేదు. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. గతంలో ఉన్నతి పథకం ద్వారా సబ్ ప్లాన్ మండలాల పరిధిలో ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా సంఘ సభ్యులకు రుణాలు మంజూరు చేశారు. అయితే కొంతమంది వీవోఏల ప్రతినిధులు సీసీలతో చేయికలిపి లబ్ధిదారులకు రుణాలు అందించకుండా నిధులను దారి మళ్లించారు. దీనిపై కొన్నాళ్లుగా విచారణ జరుగుతున్నా.. ఇంతవరకు ఎటువంటి చర్యల్లేవు. తాజాగా డీఆర్‌డీఏలో వెలుగు శాఖ విలీనం చేయడంతో అక్రమాల కథ కొలిక్కివచ్చేనా ? అన్నది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. పక్కదారి పట్టిన సొమ్మును బాధ్యుల నుంచి రివకరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళా సంఘ సభ్యులు 8,236 మందికి రూ.31.84 కోట్లను గతంలో రుణాలుగా అందించారు. అయితే పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని కొన్ని మండలాల్లో లబ్ధిదారులకు ఈ రుణాలను అందించలేదు. నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గతంలో కొన్ని క్లస్టర్లలో అధికారులు విచారణ చేపట్టారు. సదరు ఉద్యోగుల నుంచి నిధుల రికవరీకి ఆదేశించినా.. ఇప్పటివరకు ఆ దిశగా చర్యల్లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




ఈ భవనంలోనే కొనసాగుతున్న డీఆర్‌డీఏ కార్యాలయం

కొన్ని మండలాల్లో ...

- సాలూరు మండల పరిధిలో 692 మంది సభ్యులకు రూ.2.63 కోట్లును ఉన్నతి ద్వారా రుణాలుగా అందించారు. కానీ తోణాం, బాగువలస క్లస్టర్ పరిధిలో ఉన్నతి రుణాలు పక్కదారి పట్టాయని ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.పది లక్షలు పైబడి రుణాలు లబ్ధిదారులకు

(మిగతా 6వ పేజీలో...)



అంబేడ్కర్ గురుకులాల్లో

మిగులు సీట్లకు 25న పరీక్ష

- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహణ
- 23లోగా దరఖాస్తులు చేసుకోవాలి
- జిల్లా కో ఆర్డినేటర్ రూపవతి



గరుగుబిల్లి/సాలూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 25న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.రూపవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని 13 గురుకులాల్లో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సీట్ల భర్తీకి ఈ నెల 25న బాలికలకు నెల్లిమర్ల సాంఘిక సంక్షేమ పాఠశాలలో, బాలురకు కొప్పెర్లలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశం కోరే వారు ఈ నెల 23 లోగా దరఖాస్తులివ్వాలని సూచించారు. అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశానికి పరీక్ష రాసి సీటు రాని బాలురు ఈ నెల 23న కొప్పెర్ల, బాలికలు చీపురుపల్లిలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఇంటర్మీడియట్ ప్రథమ ఏడాదికి ప్రవేశపరీక్ష రాసి సీటు రాని బాలికలు ఈ నెల 26న నెల్లిమర్లలో, బాలురు 27న కొప్పెర్లలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని మాత్రమే కౌన్సిలింగ్‌కు రావాలని తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారు చేయాలి

- డీపీవో కొండలరావు

సీతానగరం, జూన్19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్‌డబ్ల్యూపీసీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేయాలని డీపీవో కొండలరావు ఆదేశించారు. పెదభోగిలిలో ఎస్‌డబ్ల్యూపీసీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెత్త సంపద కేంద్రాల నుంచి సేంద్రియ ఎరువుల ఉత్పత్తికి అవసరమైన వనరులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. వాటి విక్రయం ద్వారా సమకూరే నిధులను గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని సిబ్బందికి సూచించారు. పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో ఎరువు తయారీకి అవసరమైన ముడి సరుకు సేకరించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోని ఎస్‌డబ్ల్యూపీసీల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో కార్యదర్శులు సేంద్రియ ఎరువు తయారీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వాటి ద్వారా ఆదాయం పొందాలన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయండి

- పీఏసీఎస్ సంఘం సభ్యుల డిమాండ్
- డీసీసీబీ కార్యాలయం ఎదుట నిరసన



డీసీసీబీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీఏసీఎస్ సంఘు సభ్యులు

పార్వతీపురం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో పనిచేస్తున్న సిబ్బందికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ఆ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం పార్వతీపురంలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సత్యం, బి.రాము నాయుడు మాట్లాడుతూ... '2019 నుంచి 2024 వరకు వేతన సవరణ జరిపి కొత్త జీతాలు నిర్ణయించాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచే విధంగా డీఎల్‌ఏసీలో తీర్మానించాలి. 2019 తరువాత విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలి. రెగ్యులర్ సిబ్బందిని పీఏసీఎస్‌లో ఖాళీగా ఉన్న సీఈవో పోస్టులకు ఎంపిక చేయాలి. సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలి. డీసీసీబీ సీఈవో ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం తక్షణమే డీఏ అమలు చేయాలి. జిల్లాలో పీఏసీఎస్ ఉద్యోగులకు అడ్వాన్సు రూపంలో జీతాలు చెల్లించడం చట్టవిరుద్ధం. అందుకే జీతాలు చెల్లించేందుకు పర్సన్ ఇన్‌చార్జులకు ఆదేశాలు జారీ చేయాలి.' అని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా సహకార అధికారి పి. శ్రీరామ్మూర్తికి వినతిపత్రం అందించారు. సంఘ గౌరవాధ్యక్షుడు పి. కామేశ్వరరావు, కోశాధికారి ఏవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి

విజయనగరం రింగురోడ్డు, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి దిశానిర్దేశం చేశారు. విజయనగరంలోని మెసానిక్ టెంపుల్లో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో జరిగే కార్యక్రమాలకు జిల్లా ఇన్‌చార్జితో పాటు డీసీసీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు పాల్గొనడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వస్తుందన్నారు. కార్యకర్తలను ముందుకు నడిపించి జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ బలోపేతమై, రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయాలన్నారు.



ప్రమాణం చేస్తున్న షర్మిలారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

యోగాంధ్రకు సమాయత్తం కావాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి సమాయత్తం కావాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. 'అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం ఏడు గంటల నుంచి 8 గంటల వరకు విశాఖలో జరిగే యోగాంధ్రలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు. అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 3,150 వేదికల వద్ద యోగా కార్యక్రమం నిర్వహించాలి. ఇప్పటికే నమోదు చేసుకున్న 5.42 లక్షల మంది ఆ రోజు యోగాంధ్రలో పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రజలతో పాటు మంత్రులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలి. అదే రోజు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఉంటుంది. డీఏ జుగా ద్వారా ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలి.' అని తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్వో కె.హేమలత డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీవో టి.కొండలరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలకు అభినందనలు

రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో విజేతలుగా నిలిచిన పది మంది జిల్లా వాసులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అభినందించారు. గురువారం తన చాంబర్‌లో కలిసిన విజేతలను ప్రశంసిస్తూ జిల్లాకు మంచి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు ద్వితీయ స్థానం రావడంపై హర్షం వ్యక్తం చేశారు. 13 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 10 బహుమతులు గెలవడం గొప్ప విషయమన్నారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

జిల్లాలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి వేడుకలు నిర్వహిస్తామన్నారు. మన్యంలోని ప్రతి తహసీల్దార్ కార్యాలయంలోనూ రెవెన్యూ డే జరపాలని ఆదేశించారు. రెవెన్యూ ఉద్యోగుల బాధ్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



సికిల్ సెల్ అనీమియాపై అవగాహన పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్

సికిల్‌సెల్ అనీమియా నిర్మూలనే ధ్యేయం

సికిల్ సెల్ అనీమియా నిర్మూలనే ధ్యేయంగా పనిచేయా లని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లాలో 1,36,361 మందికి వైద్య పరీక్షలు చేయగా.. 287 మంది సికిల్ సెల్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. వ్యాధిగ్రస్థులను మందులు అందజేసి వారి ఆరోగ్యాన్ని వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి వ్యాధి ముదరకుండా చూడాలన్నారు.

ఆ చోరీ పార్ధగ్యాంగ్ పనే!

- రైల్వే ట్రాక్ సమీప గ్రామాలే వారి లక్ష్యం
- 'గురుదేవ ట్రస్టు' ఘటనపై నిర్ధారణకు వచ్చిన పోలీసులు

కొత్తవలస, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మంగళపాలెం గ్రామంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో దొంగతనానికి పాల్పడింది మహారాష్ట్రకు చెందిన పార్ధగ్యాంగ్‌గా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ గ్యాంగ్ దేశమంతా రైళ్లలో టిక్కెట్ లేకుండా ప్రయాణం చేస్తూ రైల్వే ట్రాక్‌లకు దగ్గరలో ఉన్న గ్రామాలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడతారని సమాచారం. ఆ విధంగానే రైల్వే ట్రాక్‌కు కూతవేటు దూరంలో ఉన్న మంగళపాలెం గ్రామం వద్ద రైలు కొద్దిగా నెమ్మదించిన సమయంలో దిగిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఈ గ్యాంగ్‌కు సంబంధించి ఒక నిందితుడను పట్టుకుని కొత్తవలస కోర్టులో హాజరుపర్చిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలతో నిందితుడు వారం రోజులుగా పోలీసు కస్టడీలోనే ఉన్నాడు. తనను కాపాలాగా మాత్రమే బయట ఉంచారని, తనకు కొంత నగదు మాత్రమే ఇచ్చారని మాత్రమే చెబుతున్నట్టు సమాచారం. చోరీలో ఎంతనగదు, బంగారం పట్టుకుపోయారు.. మిగిలిన నిందితుల పేర్లు ఏమిటి..? వారెక్కడ ఉంటున్నారు తదితర ప్రశ్నలకు సరిగా సమాధానం చెప్పడం లేదని సమాచారం.

జగన్నాథుని రథయాత్రకు ఏర్పాట్లు

6లో

మళ్లీ జానపద పరిమళాలు

- గ్రామీణ కళలకు పెరుగుతున్న ఆదరణ
- ప్రసారమాధ్యమాలతో గుర్తింపు
- కళాకారులకూ పేరుప్రఖ్యాతులు

4లో



ధర లేక దిగాలు


- ఆయిల్‌పామ్ గెలల ధర పతనం
- కేంద్రం దిగుమతి సుంకం తగ్గించడమే కారణం
- ఆందోళనలో ఉమ్మడి జిల్లా రైతులు.. ఆదుకోవాలని విన్నపం



ఆయిల్ పామ్ తోట

కురుపాం,జూన్19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటకు గిట్టుబాటు ధర లేక తలలు పట్టుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించింది. ఈ కారణంగా ఆయిల్ పామ్ గెలల ధర పతనమైంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కేంద్ర సర్కారు చర్యలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. వాస్తవంగా ఉమ్మడి జిల్లాలో ఏడు వేల హెక్టార్లలో సుమారు నాలుగు వేల మంది ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. నాలుగు వేల ఎకరాల్లో పాత తోటలు ఉండగా, మరో 3 వేల ఎకరాల్లో పంట రానున్న ఆరు నెలలు, ఏడాదిలో చేతికి రానుంది. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. కాగా సాగు ఖర్చుల కంటే తక్కువ ధర రావడంతో గతంలో చాలామంది రైతులు తోటలను తొలగించారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. అయితే ఇటీవల కాలంలో ధర ఆశాజనకంగా ఉండడంతో మళ్లీ ఆయిల్‌పామ్ సాగుపై మొగ్గు చూపారు. కాగా కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో గెలల ధర తగ్గింది. గత నెలలో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ20,290 వరకు

(మిగతా 6వ పేజీలో...)



దిగుమతి సుంకం తగ్గించడం వల్లే..

కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్‌పై దిగుమతి సుంకం తగ్గించడం వల్ల ప్రస్తుతం గెలల ధర తగ్గింది. రానున్న రోజుల్లో ఈ ధర ఎంత మేరకు తగ్గుతుందనేది చెప్పలేం.

- క్రాంతి కుమార్, ఉద్యాన శాఖాధికారి, పార్వతీపురం

వికసించిన బ్రహ్మకమలాలు

4లో

సుందరయ్యగూడలో గజరాజులు

4లో

'తల్లికి వందనం' వినతులకు నేడే ఆఖరు రోజు

- సచివాలయాలకు క్యూ కడుతున్న మహిళలు
- సాంకేతిక సమస్యలను సరిచేస్తున్న సచివాలయ సిబ్బంది

4లో



మళ్లీ జానపద పరిమళాలు

- గ్రామీణ కళలకు పెరుగుతున్న ఆదరణ
- ప్రసారమాధ్యమాలతో గుర్తింపు
- కళాకారులకూ పేరు ప్రఖ్యాతులు



విజయనగరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి)

జానపద కళలు.. పురాతన కాలం నుంచీ జన జీవితాల్లో ఓ భాగంగా ఉంటున్నాయి. వీటిని నమ్ముకున్న వారు... ఆదరించిన వారు... ప్రోత్సహించిన వారు ఎందరో. జానపద కళాకారులకు ఒకప్పుడు ఎంతో ఆదరణ ఉండేది. రానురానూ ఆదరణ తగ్గడంతో... తరతరాలుగా వారసత్వంగా వచ్చిన కళలకు కూడా కళాకారులు దూరమవుతూ వచ్చారు. రెండు దశాబ్దాలుగా వీటి ప్రాభవాన్ని కోల్పోతూ వచ్చాయి. సోషల్ మీడియా.. టీవీ మాధ్యమాలు వీటి పునర్ వైభవానికి తమవంతు కృషి చేస్తున్నాయి. ఫలితంగా ఇప్పుడిప్పుడే మళ్లీ ఇవి గత వైభవం సంతరించుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి.

జానపద కళలకు పూర్వవైభవం దిశగా అడుగులు పడుతున్నాయి. ఓవైపు పల్లెల్లోని కుర్రాళ్లు సొంతంగా పాటలు రాస్తూ... వీడియోలు రూపొందిస్తూ వీక్షకుల ప్రశంసలు అందుకుంటుంటే... మరోవైపు చెక్కభజన, కోలాటం, తప్పెటగుళ్లు వంటి గ్రామీణ కళలకూ మంచి రోజులు వస్తున్నాయి. ఈ కళాకారులకూ జనాదరణ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఉత్సవాల్లో వీరి ప్రదర్శనలు పెరుగుతున్నాయి.

సోషల్ మీడియాతో...

సోషల్ మీడియాలో జానపద కళలు, పాటలు వీక్షించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. జానపద కళాకారులకు గుర్తింపూ పెరుగుతోంది. విజయనగరం జిల్లా నుంచి కూడా అనేకమంది జానపద కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇస్తూ.. గుర్తింపు పొందుతున్నారు. కొంతమంది సమకాలీన అంశాలను ఇతివృత్తంగా తీసుకొని పాటలు, ఇతర కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. స్వయంగా పాటలు రాసి.. ఆలపిస్తున్న వారూ ఉన్నారు. వీరు మ్యూజిక్, డ్యాన్స్ ఆల్బమ్‌లతోనూ అలరిస్తున్నారు. వీరికి ప్రేక్షకుల మన్ననలూ అదే స్థాయిలో అందుతున్నాయి. సోషల్ మీడియాలో ఎక్కువ వ్యూస్ రావడంతో ఆర్థికంగానూ కుదురుకుంటున్నారు. ఇటీవల కాలంలో వివాహాది శుభకార్యాలు, వినాయక చవితి, దసరా ఉత్సవాలు, గ్రామ దేవతల పండుగల్లో ఏర్పాటు చేసిన వేదికలపై జానపద కళాకారుల సందడి పెరుగుతోంది.

కళాకారుల సమస్యలు ఇవీ..

జానపద కళలను నమ్ముకున్న వారిలో అత్యధికం ఆర్థికంగా వెనుకబడిన వారే. తమకు పింఛను సౌకర్యం కల్పించడంతో పాటు, నివాసానికి ఇళ్ల వంటివి ఇవ్వాలని జానపద కళాకారులు కోరుతున్నారు ప్రభుత్వ కార్యక్రమాల్లో కోలాటం, చెక్కభజన వంటి వాటికి ప్రాధాన్యం పెంచాలని కోరుతున్నారు. విజయనగరం, బొబ్బిలి, కొత్తవలస, ఎస్.కోట, గరివిడి, చీపురుపల్లి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో వీరు ఎక్కువ సంఖ్యలో వీరు ఎక్కువగా ఉన్నారు. ఈ కళాకారులను ప్రోత్సహిస్తే.. జానపదాలకు సంపూర్ణంగా పూర్వ వైభవం వస్తుందని కళాభిమానులు విశ్వసిస్తున్నారు.

కోలాటానికీ కొత్త కళ..

మరోవైపు చెక్కభజన, కోలాటం, తప్పెటగుళ్లు వంటి పల్లె కళలకూ ఆదరణ పెరుగుతోంది. విజయనగరం జిల్లాలో కోలాటానికి సంబంధించి దాదాపు 20 నుంచి 25 బృందాలు ఉన్నాయి. వీరు జానపద, ఆధ్యాత్మిక గీతాలకు నృత్యం చేస్తుంటారు. ముఖ్యంగా గ్రామదేవతలు, ఆలయాల ఉత్సవాల్లో వీరి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వీరికి అంతో ఇంతో ఆదాయం సమకూరుతోంది. ఒక గ్రూప్‌నకు 18 నుంచి 20 మంది మహిళలు, పురుషులు ఉంటున్నారు. సంప్రదాయ వస్త్రధారణతో కాళ్లకు గజ్జెలు కట్టుకొని వీరు నర్తిస్తున్నారు. ఇటీవల కాలంలో కొంతమంది వివాహాది శుభకార్యాల ఊరేగింపునకు కూడా ఈ కోలాటం వంటివి ఏర్పాటు చేసి సందడి చేస్తున్నారు.







శివడవలస తోటల్లో ఉన్న ఏనుగులు



సుందరయ్య గూడలో ఉన్న గజరాజులు

శివడవలసలో ఏనుగుల గుంపు

- భయాందోళనలో గ్రామస్తులు

బొబ్బిలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివడవలసలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. బుధవారం రాత్రి ముత్తావలస నుంచి చేరుకున్న ఏనుగులు అక్కడే మామిడి, జీడి తోటల్లో తిష్టవేశాయి. దీంతో ఏ రోజు ఏ గ్రామంలో ప్రమాదాలకు కారణమవుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన్యం జిల్లా నుంచి వచ్చి.. ఇప్పుడు విజయనగరం జిల్లాలో తిరుగుతున్నాయి. ఇటు ప్రజలు, అటు అధికారులు, సిబ్బందికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ గుంపులో ఇటీవల జన్మించిన గున్న ఏనుగు, మరో రెండు చిన్నవి, ఆరు పెద్ద ఏనుగులు ఉన్నాయి. అటవీ శాఖ ట్రాకర్లు, సిబ్బంది ఏనుగుల జాడలను గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌బీవో స్వప్న మాట్లాడుతూ వాటి దగ్గరకు ఎవరూ వెళ్లవద్దని... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పొలాలకు గుంపులుగా వెళ్లాలని సూచించారు.

సుందరయ్యగూడలో...

సీతంపేట రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పులిపుట్టి పంచాయతీ పరిధిలోని సుందరయ్యగూడ గ్రామంలో గజరాజులు సంచరిస్తున్నాయి. బగ్గ టేకు తోటల్లో తిష్ట వేసిన గజరాజులు గురువారం వేకువజామున పాలకొండ-హడ్డుబంగి రహదారి దాటి వెంపలగూడ జంక్షన్ మీదుగా సుందరయ్యగూడ గ్రామ సమీపంలోని జీడితోటల్లోకి ప్రవేశించినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఏనుగుల గమనాన్ని ట్రాకర్స్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారని ఎఫ్ఆర్‌వో రామారావు తెలిపారు.

'తల్లికి వందనం' వినతులకు నేడే ఆఖరు రోజు

- సచివాలయాలకు క్యూ కడుతున్న మహిళలు
- సాంకేతిక సమస్యలను సరిచేస్తున్న సచివాలయ సిబ్బంది



కురుకూటిలో వినతులతో వచ్చిన స్థానికులు

సాలూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకంలో పొరపాటున పేరు లేకపోయిన అర్హులు వినతులు ఇవ్వడానికి (ఈ నెల 20) శుక్రవారమే ఆఖరి రోజు. ఈ పథకానికి తాము అర్హులమని.. సాయం జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అనేకమంది తమ పరిధిలోని సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ పథకానికి అర్హులుగా 1,08,951 మంది విద్యార్థులను గుర్తించారు. ఈ పథకం అమలుకు జిల్లాకు రూ.163.42 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు 69,600 మంది తల్లుల ఖాతాల్లో రూ.141.63 కోట్లు జమ చేశారు. పాఠశాలల అభివృద్ధికి కలెక్టర్ ఖాతాలో రూ.21.79 కోట్లు జమ చేశారు. ఈ ఏడాది ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలు జరుగుతున్నందున వారికి సైతం ఈ పథకాన్ని వర్తింపజేసే అవకాశం ఉంది. దీంతో మరిన్ని నిధులు విడుదలయ్యేందుకు అవకాశముంది.

నిధులు జమ కాలేదని...

ఈ పథకానికి అర్హులమైన తమకు నిధులు జమ కాలేదని కొంతమంది తల్లులు ఆందోళన చెందారు. అర్హులైన విద్యార్థులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు అర్హులై ఉండి... నిధులు రాకపోతే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని సచివాలయాల్లో పలువురు వినతులు ఇస్తున్నారు. విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటినట్టు చూపించిన వారు ఏపీఈపీడీసీఎల్ ఏఈల నుంచి తమ వినియోగ వివరాలు చూపించి.. ధ్రువపత్రాలు తెచ్చి సమర్పిస్తున్నారు. కొందరికి తమ పేరుతో అనేక విద్యుత్ మీటర్లు చూపెడుతుండడంతో వారు సైతం ఏపీఈపీడీసీఎల్ ఏఈల వద్ద ధ్రువీకరణ పత్రాలు పొంది గ్రీవెన్స్ ఇస్తున్నారు. అనర్హుల జాబితాలో అర్హులుంటే సంబంధిత ధ్రువీకరణ పత్రం సమర్పించి, వివరిస్తే సమస్య పరిష్కరమయ్యే అవకాశముంది. ఈమేరకు శుక్రవారం అధికారులు వినతులు స్వీకరిస్తారు. వాటిని ఈ నెల 21 నుంచి 28 వరకు పరిశీలించి పరిష్కరిస్తారు. సచివాలయాల్లో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ బాధ్యతలు చూస్తున్నారు. మరోవైపు సర్వర్ సమస్య వెంటాడుతోంది. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తుదారుల్లో అర్హులైన వారిని ఉంటే వారికి వచ్చే నెల 5న 'తల్లికి వందనం' నిధులను జమ చేయనున్నారు. ఈ మేరకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు తల్లులకు ఈ విషయమై అవగాహన కల్పిస్తున్నారు.

పనితీరు మార్చుకోండి

- ఆర్డీవో ఆశయ్య

వంగర, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని చీపురుపల్లి ఆర్డీవో ఆశయ్య హెచ్చరించారు. లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డబ్బులు ఇవ్వనిదే తహసీల్దార్ కార్యాలయంలో పనులు జరగటంలేదని గురువారం వివిధ పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. వెంటనే వంగర మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీయాలని ఆర్డీవోను ఆదేశించారు. దాంతో ఆర్డీవో.. తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరోపణలకు సమాధానం చెప్పాలన్నారు. అంతా మౌనంగా ఉండటంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలన్నారు వారి అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశించారు.



సిబ్బందితో మాటాడుతున్న ఆశయ్య

ఉల్లాసంగా... ఉత్సాహంగా

- విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

నెల్లిమర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని ఎంజేపీ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత గురువారం సందర్శించారు. విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. తొలుత మంత్రి ఉపాధ్యాయులతోనూ, విద్యార్థులతోనూ విడివిడిగా సమావేశమై మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పిల్లలు తయారు చేసిన వివిధ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేబీబీరావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్ తరగతి గదులు నిర్మించాలని, కళాశాలకు వచ్చే రోడ్డును బాగుచేయాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ ఆకృతులను తిలకించి.. అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇంటర్ పరీక్షల్లో బీసీ గురుకులాలు మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందని అన్నారు. ఈ నెల 21న విశాఖలో జరుగనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కరుమజ్జి గోవిందరావు, ఎడ్ల గోవిందరావు, రవికుమార్, బీజేపీ నాయకులు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మ కమలాలు

వికసించిన బ్రహ్మ కమలాలు

సీతంపేట రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఉద్యోగి ఐ.ప్రసాదరావు ఇంట్లో బుధవారం రాత్రి సమయంలో అరుదైన బ్రహ్మకమలాలు వికసించాయి. శివునికి ఎంతో ప్రీతిపాత్రమైనవిగా భావించే బ్రహ్మకమలం పుష్పాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇవి ఏడాదికి ఒక్కసారి మాత్రమే వికసిస్తాయి. ఆ ఉద్యోగి ఇంట్లో 20కి పైగా పూవులు ఒకేసారి వికసించాయి. వీటిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ముప్పు తప్పించేదెవరు?

- రోజురోజుకూ ముందుకొస్తున్న సముద్రం
- కెరటాల తాకిడితో తగ్గుతున్న ఇసుక దిబ్బలు
- ఆందోళనలో మత్స్యకారులు

భోగాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం సముద్ర తీర ప్రాంతం రోజురోజుకీ గణనీయంగా కోతకు గురవుతోంది. విజయనగరం జిల్లాలోని రెండు మండలాల పరిధిలో సుమారు 28 కిలోమీటర్ల మేరకు సముద్ర తీరం విస్తరించి ఉంది. అయితే ఎక్కడికక్కడే నిరంతరం తీరం కోతకు గురవుతుండడం మత్స్యకారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఏటా తుపాన్ల సమయంలో భోగాపురం మండలం ముక్కాం గ్రామం అధికంగా కోతకు గురవుతుంటుంది. ప్రస్తుతం గత కొన్ని రోజులుగా సముద్రం బాగా ముందుకు వస్తోంది. సముద్ర కెరటాలు ఉధృతంగా తీరాన్ని తాకుతుండడంతో నిరంతరం కోతకు గురవుతూనే ఉంది. ఇసుక దిబ్బలు కరిగిపోతున్నాయి. దీంతో గ్రామస్థులు పడే బాధలు వర్ణనాతీతం. ఏ క్షణాన సాగరం ఊరి మీదకు వస్తుందోనని సమీప గ్రామాల ప్రజలు తల్లడిల్లుతున్నారు. రుతు పవనాల సీజన్‌లో వచ్చే వరదలు, సముద్ర మట్టాల పెరుగుదల, జలాలు కలుషితం కావడం, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల కలయికతో భారీ అలలతో తీరం నిరంతరం కోతకు గురవుతూనే ఉంది.



కోతకు గురైన ముక్కాం సముద్ర తీరం



కెరటాల తాకిడికి దెబ్బతిన్న చెట్లు, మొక్కలు (ఫైల్)

తుఫాన్ల సమయంలో..

సహజంగా బంగాళాఖాతంలో అల్పపీడనాలు, తుపానులు ఎక్కువగా సంభవిస్తుంటాయి. అవి తీరం దాటే సమయంలో విధ్వంసం సృష్టిస్తాయి. ఆ సమయంలో సముద్రం ఉగ్రరూపం దాల్చుతుండడంతో తీరం కోతకు గురవుతోందని సంబంధిత నిపుణులు చెబుతున్నారు. భోగాపురం, పూసపాటిరేగ రెండు మండలాల్లో 16 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. తీరం కోతకు గురవుతుండడంతో ఆ గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రెండు మండలాల్లో తీరం పొడవునా కొన్నేళ్ల క్రితం సరుగుడు, నీలగిరి తోటలు విస్తారంగా ఉండేవి. ఆ చెట్లన్నీ చాలా వరకు నరికివేతకు గురయ్యాయి. సముద్రం పైనుంచి వీచే ఉప్పు గాలుల కారణంగా సమీప పంట పొలాలు చౌడుబడిపోవడంతో పంట దిగుబడి తగ్గిపోతోంది. కెరటాలు తీరాన్ని తాకుతూ సముద్రం ముందుకు రావడంతో తాగునీరు ఉప్పునీరుగా మారుతోంది. తీరంలో ఇసుక దిబ్బలు, చెట్లు లేకపోవడంతో సముద్రం గ్రామాలను తాకుతోంది. ముక్కాం, చేపలకంచేరు, దిబ్బలపాలెం, ఎర్రముసలయ్యపాలెం, కొండ్రాజుపాలెం, చింతపల్లి, తిప్పలవలస తదితర గ్రామాల పరిధిలో గతంలో పోలిస్తే ప్రస్తుతం సముద్ర సుమారు 100 మీటర్ల వరకు ముందుకు వచ్చినట్టు మత్స్యకారులు వాపోతున్నారు. తీర ప్రాంతంలో చెట్లను తొలగించి... కొంతమంది తీరాన్ని ఆక్రమించుకున్నట్టు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తీర ప్రాంత పటిష్ఠతపై ప్రభుత్వం దృష్టి సారించాలని.. కోతకు గురి కాకుండా రక్షణ కల్పించేలా సరుగుడు, తాటి చెట్లు పెంచాలని మత్స్యకార గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు పెంచుతాం..

తీర ప్రాంత రక్షణపై జిల్లా అటవీశాఖ అధికారి కొండలరావును వివరణ కోరగా... జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలోని తీరంలో కొంతమేర అటవీ ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. మిగతా ప్రాంతం అంతా రెవెన్యూ వారి ఆధీనంలో ఉంటుందని చెప్పారు. రెవెన్యూ అధికారులు, ఆ గ్రామాల పరిధిలోని ప్రజలు సహకరిస్తే మొక్కలు పెంచుతామని తెలిపారు.

ఆందోళన కలిగిస్తోంది..

తీరం కోతకు గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఏడాదికేడాది తీరం నిడివి తగ్గముఖం పడుతోంది. భారీ తుఫాన్ల సమయంలో మత్స్యకార గ్రామాల్లోకి సైతం నీరు చొచ్చుకొస్తోంది. ఆ సమయంలో మా బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా ప్రభుత్వం తీర ప్రాంత రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.

-జి.చినరాము, మత్స్యకారుడు, ముక్కాం

ప్రభుత్వాలు స్పందించాలి

తీర ప్రాంత పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు చేపట్టాలి. లేకుంటే తీర ప్రాంతం మనుగడ కష్టం. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. తీరం కోతకు గురవుతుండడంతో అనేక అనర్థాలు, ఇబ్బందులు తప్పవు. అందుకే దీనిపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉంది.

-బి.నాయుడు, మత్స్యకారుడు

ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయ్

● ఒకచోట ప్రాథమిక పాఠశాలను ఆనుకుని బావి ● మరోచోట రహదారి మధ్యలో గొయ్యి

● ఇదే నిర్లక్ష్యం కొనసాగిస్తే మూల్యం చెల్లించాల్సిందే..



పాఠశాలకు చేరువలో శిథిల భవనం, బావి

భోగాపురం/ రాజాం రూరల్, జూన్19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల ఆవరణలో పాత బావితో పాటు శిథిల భవనం, రాజాం పట్టణ ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. ఆదమరిస్తే మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. భోగాపురం మండలం జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా పెద్ద బావి ఉంది. ఆ పక్కనే శిథిలమైన పాఠశాల భవనం కూడా ఉంది. విద్యార్థులు పాఠశాల విరామ సమయంలో పాబావి, శిథిల భవనం పరిసరాల్లో తిరుగుతుంటారు. దాంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

● రాజాం పట్టణంలో రద్దీగా ఉండే ప్రధాన రహదారి మధ్యలో అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గొయ్యి పడింది. వారం రోజులు కావస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. గొయ్యి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో అక్కడి చిరువ్యాపారులు ప్రమాదాల తీవ్రతను తగ్గించాలనే ప్రయత్న చేశారు. డివైడర్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన రేడియం పోల్‌ను గుంతలో వారు పాతారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించాల్సి ఉంది.



రాజాం ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యి

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

మెంటాడ, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాడవలసకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ జి.రామునాయుడను విధుల నుంచి తొలగించారు. గురువారం డ్వామా పీడీ శారదాదేవి ఉత్తర్వులు జారీచేశారు. రామునాయుడు వేతనదారులకు పూర్తిస్థాయి పని దినాల కల్పనలో విఫలమైనట్టు అందులో పేర్కొన్నారు. ఆయన అధీనంలో ఉన్న రికార్డులు, మొబైల్, సీయూజీ సిమ్‌ను అప్పగించాలని ఆదేశించారు. గతనెల 14న ఫీల్డ్ అసిస్టెంట్ రామునాయుడుపై స్థానిక జనసేన నాయకుడు, మాజీ వీఆర్వో చింత పైడితల్లి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పీఆర్ ఆర్డీ కమిషనర్ కృష్ణతేజ నుంచి అందిన ఆదేశాల మేరకు రాము నాయుడుపై పీడీ చర్యలకు ఉపక్రమించారు.

నోట్ పుస్తకాల వితరణ

వేపాడ, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దబ్బిరాజుపేట మోడల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం రెడ్డి శంకరరావు నోట్ పుస్తకాలను గురువారం వితరణ చేశారు. ఇక్కడ చదువుతున్న 60 మంది విద్యార్థులకు రూ.10 వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లను పంపిణీ చేశారు, కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరరావుకు హెచ్ఎం ఆర్.చెల్లంనాయుడు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

వేపాడ, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు గురువారం భూమి పూజ చేశారు. ఇందుకుగానూ మండల పరిషత్ నుంచి రూ.2 లక్షలు వెచ్చించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మురుపిండి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఆకులు సత్తిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్.కోటలో 'వికసిత భారత్'



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహం

శృంగవరపుకోట, జూన్19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం బీజేపీ నాయకులు వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు యోగా విశిష్టతపై అవగాహన కల్పించారు. విశాఖలో శనివారం నిర్వహించనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పుణ్యగిరి రోడ్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ పార్టీ కన్వీనర్ లక్ష్మీనర్సింహం, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ఆర్‌కె ప్రసాద్, నాయకులు సీహెచ్ అప్పారావు, టి.రాముడు, రూపేశ్, డి.సూర్యారావు తదితరులున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వియ్యంపేటలో గల డాక్టర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎన్‌వీఎస్ లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 42 , 7వ తరగతిలో 14, 8వ తరగతిలో 17, తొమ్మిదో తరగతిలో 9 ఖాళీలు ఉన్నాయని వివరించారు. 6 నుంచి 9వ తరగతుల్లో చేరనున్న విద్యార్థులు ఈనెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రవేశపరీక్ష ఈనెల 25న ఉదయం 10 గంటలకు నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. ఈ పాఠశాలలో చేరేందుకు 5వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరై సీటు రాని విద్యార్థినులు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు చీపురుపల్లి గురుకుల బాలికల పాఠశాలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చన్నారు. అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరికకు ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని వారు ఈ నెల 26న ఉదయం నెల్లిమర్ల గురుకులంలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

గరివిడి, జూన్19 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని పలువురు గరివిడి మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు కోరారు. గురువారం మండలంలో కొండపాలెం (గరివిడి) మేజర్ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఈవో నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని ఐ-టైప్, జె-టైప్, డబుల్ రూం క్వార్టర్స్‌లో తాగునీటి సమస్య, అండర్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. కాలనీలో తాగునీరు ఎప్పుడు సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పారిశుధ్య సమస్య అధికంగా ఉందని, కాలనీలో దుర్వాసన వెదజల్లుతోందని. ఇందుకు పంచాయతీ ఈవో సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానన్నారు.

సేవలోనే నిజమైన ఆనందం



వైద్యులతో మాట్లాడుతున్న వెంకటరామరాజు, ఎమ్మెల్యే అదితి

విజయనగరం రింగురోడ్డు, జూన్19 (ఆంధ్రజ్యోతి): సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు అన్నారు. గురువారం ఘోషాసుపత్రికి ఆయన రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను సమకూర్చారు. వాటిని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికసేవే లక్ష్యంగా ఎన్నో పాఠశాలలు, ఆసుపత్రులు, అనాథశ్రమాలు, వృద్ధాశ్రమాలకు సదుపాయాలు కల్పించేందుకు విరాళాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

యోగాంధ్రకు యువత హాజరుకావాలి



టీడీపీ శ్రేణులతో సుబ్బనాయుడు

భోగాపురం, జూన్19(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి యువత పెద్దఎత్తున హాజరయ్యేలా చూడాలని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ క్యాడర్ మొబిలైజేషన్ అబ్జర్వర్, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ మాలిపాటి సుబ్బనాయుడు అన్నారు. గురువారం మండలంలోని పోలిపల్లిలో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ అధ్యక్షతన టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బనాయుడు మాట్లాడుతూ విశాఖ నుంచి భీమిలి వరకు సముద్ర తీరంలో 5 లక్షల మందితో నిర్వహించనున్న కార్యక్రమానికి స్థానిక నియోజకవర్గం నుంచి అధికంగా పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో కర్రోతు రాజు, నీలాపు అప్పలరామిరెడ్డి, కోరాడ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సాగు ఖర్చు తగ్గించండి



రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

డెంకాడ, జూన్19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు సాగు ఖర్చు తగ్గించి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు ఆకాంక్షించారు. గురువారం మండలంలోని ఆమకాం పంచాయతీలో వ్యవసాయ అధికారి సంగీత ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చంద్రశేఖరరావుతో పాటు ఎంపీపీ బి.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతీ రైతు అవగాహనతో సాగు చేయాలన్నారు. సాగు ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధిస్తే ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగుచేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల శ్రీను, సర్పంచ్ అప్పారావు, ఏఈవో ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన నాయకులు



షర్మిలతో కాంగ్రెస్ నాయకులు

శృంగవరపుకోట రూరల్, జూన్19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యటనకు విచ్చేసిన పీసీసీ చీఫ్ షర్మిలను గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కలిశారు. మండలంలోని బొడ్డవర పంచాయతీ భవానీనగర్‌లో గల రిసార్ట్ నుంచి ఆమె విజయనగరం బయలుదేరే ముందు ఆమెను నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

విద్యా సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాజాం, జూన్19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిస్వార్థంగా పోరాటం చేస్తోందని వక్తలు కొనియాడారు. పట్టణంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభల సందర్భంగా గురువారం విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేశ్ ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమేశ్, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్షుడు డి.రాము తదితరులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకీ, శిరీష, వంశీ, సోమేశ్, రమణ, గౌరి, నాని తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

● మంత్రి సవితకు మహిళల వినతి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

నెల్లిమర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో కొద్దిరోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని నెల్లిమర్లకు చెందిన పలువురు మహిళలు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు తెలిపారు. గురువారం నెల్లిమర్లలోని గురుకుల పాఠశాల సందర్శనకు వచ్చిన ఆమెను స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో మహిళలు కలిశారు. తాగునీటి ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. నగర పంచాయతీ కమిషనర్‌తో మాట్లాడి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అంతకుముందు అదే మార్గంలో వచ్చిన ఎమ్మెల్యే లోకం నాగమాధవికి మహిళలు ఖాళీ బిందెలతో ఎదురెళ్లి వినతిపత్రం అందజేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి రూ.50 వేలు



గ్రీష్మకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

లక్కవరపుకోట, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురానికి ఇంజనీరింగ్ విద్యార్థి దాకవరపు గ్రీష్మకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులు గురువారం రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. రంగాపురం మాజీ సర్పంచ్ సీనియర్ టీడీపీ కార్యకర్త దాకవరపు దేముడునాయుడు అనారోగ్యంతో మూడేళ్ల కిందట మృతి చెందారు. దాంతో ఆయన కుటుంబం బాగోగులు ఎమ్మెల్యే లలితకుమారి చూస్తున్నారు. మాజీ సర్పంచ్ కుమార్తె గ్రీష్మ ఎంతవరకు చదివితే అంతవరకూ చదువుకు అయ్యే ఖర్చు ఎమ్మెల్యే కుటుంబం భరిస్తుందని అప్పట్లో ఆమె మాట ఇచ్చారు. దాంతో గురువారం మూడవ దఫా ఫీజును విద్యార్థికి గ్రామ పెద్దల సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, పార్టీ కార్యదర్శి కొట్యాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న సెర్ప్ అడిషనల్ సీఈవో

గజపతినగరం, జూన్19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక పురోగతి సాధించే దిశగా వారికి అవకాశాలు కల్పించాలని సెర్ప్ అడిషనల్ సీఈవో శ్రీరాములునాయుడు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం సభ్యురాలు పొదుపులతో పాటు తీసుకున్న రుణాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమెదు చేయాలని సీసీలు, వీవోఏలకు సూచించారు. సందర్భంగా స్త్రీ నిధి రుణాల రికవరీలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడీ కె.సావిత్రి, స్త్రీనిధి డీజీఎం కృష్ణంనాయుడు, ఏజీఎం చిట్టిబాబు, డీపీఎం లక్ష్మునాయుడు, ఏపీఎం నారాయణరావు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

శృంగవరపుకోట రూరల్, జూన్19 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని, కొత్త పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని జిందాల్ నిర్వాసితులు గురువారం నియోజకవర్గంలోని అన్ని పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, వామపక్ష నాయకులను కోరారు. తొలుత లక్కవరపుకోట వెళ్లి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి భర్త టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాంప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కొత్తవలసలోని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నివాసానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టిలో పెట్టి న్యాయం చేస్తామని కడుబండి హామీ ఇచ్చారు. తర్వాత డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, సీపీఐ రాష్ట్ర నాయకుడు కామేశ్వరరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్, సీపీఐ మండల కార్యదర్శి మద్దిల రమణ తదితరులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ముషిడిపల్లి, పెదఖండేపల్లి, కిల్తంపాలెం, బొడ్డవర ప్రాంతాల్లోని పెద్దలు, నిర్వాసితులు ఉన్నారు.

యోగాంధ్ర విజయవంతం కావాలని..



పూజలు చేస్తున్న దివ్యాంగులు

భోగాపురం, జూన్19 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ గురువారం భోగా పురంలో ఆంజనేయుడికి దివ్యాంగులు పూజలు నిర్వహించారు. మారుతీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న కార్యక్రమం విజయ వంతం కావాలని కోరారు. వర్షం పడకుండా వరుణ దేవుడు కరుణించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్ర మంలో సంఘ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నారావు, బట్నా వెంకటరమణ, బమ్మిడి పాపారావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

గజపతినగరం, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ శోభ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలకు 3 సెంట్లు చొప్పున మంజూరు చేస్తామన్నారు. ఇందుకోసం 21 గ్రామాల్లో రీసర్వే చేపట్టడం జరిగిందన్నారు. అలాగే కొత్తరేషన్ కార్డుల కోసం 2 వేల మంది నమోదు చేసుకున్నారన్నారు. జూలై మొదటి వారంలో రేషన్ కార్డులను అందజేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటింటికి తాగునీటి పథకం కింద రెండో విడత రూ.20 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఏపీఎం కృష్ణవేణి మాట్లాడుతూ గోకులాలకు రూ. 79 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. సాగునీటి కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని మొదటివిడతలో 8,400 మందికి అన్నదాత సుఖీభవ జమ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైస్ ఎంపీపీ గెద్ద దమయింతి, ఎంపీడీవో కల్యాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డెంకాడ, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతాడు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యానాది రవి (36) మృతి చెందినట్టు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల గ్రామానికి చెందిన యానాది రవి కొంతకాలంగా బొలేరో వాహనానికి క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. యథావిధిగా చిత్తూరు జిల్లా నుంచి టమాటా లోడుతో విజయనగరం వచ్చి అన్‌లోడ్ చేసి తిరిగి కిరాయి నిమిత్తం పెదతాడివాడ సమీపంలో గల ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద వేచి ఉన్న సమయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దాంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు..

జియ్యమ్మవలస, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలోని కూనేరు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. జీఆర్పీ హెచ్‌సీ రత్నకుమార్, స్థానికుల కథనం మేరకు.. కొమరాడ మండలంలోని రాజ్యలక్ష్మీపురానికి చెందిన రౌతు మోహనరావు (63) కొన్నాళ్లుగా కూనేరులోని తన తోడల్లుడు ఇంటి వద్ద కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. గురువారం ఉదయం మోహనరావు కాలకృత్యాల కోసం ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ మేరకు మృతదేహాన్ని గూడ్స్ డ్రైవర్ చూసి కీమెన్‌కు తెలియజేశాడు. ఆయన గమనించి కూనేరు స్టేషన్ మాస్టారుకు, అక్కడి నుంచి జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం అందించారు. జీఆర్పీ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య నాగరత్నం ఉన్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

రాజాం రూరల్, జూన్19 (ఆంధ్రజ్యోతి): తన భర్త సూరి రోజూ మద్యం సేవించి తనపై దాడి చేస్తున్నాడని మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన యండమూరి రాము గురువారం రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇవాళ సైతం తనను తీవ్రంగా కొట్టడంతో గాయపడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సూర్యారావు తెలిపారు.

చెత్త తెచ్చిన తంటా

● పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

రాజాం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు చెత్త రెండు కుటుంబాల మధ్య చిచ్చు రేపింది. తిట్లతో ప్రారంభమై కొట్లాటకు దారితీసేలా చేసింది. అక్కడితో ఆగకుండా ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకునే పరిస్థితికి దారితీసింది. ఏఎస్ఐ జనార్దనరావు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని రాజయ్యపేటకు చెందిన అప్పలనరసమ్మ తన ఇంటిముందు ఎవరో చెత్త వేశారని తిట్టుకుంటూ తుడుస్తోంది. ఈమె తిట్టడం గమనించిన అప్పలనరసమ్మ ఇంటి ఎదురుగా నివసిస్తున్న సామంతుల నాగరాజు కలుగజేసుకుని చెత్త మేమే వేశాం.. ఎందుకు తిడుతున్నావని నిలదీశాడు. అక్కడితో ఆగకుండా చేతులతో ఆమెపై దాడి చేశారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న నాగరాజు తల్లిదండ్రులు మంగమ్మ, అప్పలనాయుడు కూడా అప్పలనరసమ్మను కొట్టారు. అప్పలనరసమ్మ ఫిర్యాదు మేరకు నాగరాజు, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉంటే.. తనతో పాటు తన భర్త అప్పలనాయుడు, కొడుకు నాగరాజును తనింటి ఎదురుగా ఉండే అప్పలనరసమ్మ తిడుతోందని, ఎందుకు తిడుతున్నావని ప్రశ్నిస్తే ఆమెతో పాటు అతని కుమారుడు సత్యంనాయుడు మా ముగ్గిరిపై దాడి చేసి కొట్టారని మండల పరిధిలోని రాజయ్యపేటకు చెందిన సామంతుల మంగమ్మ రాజాం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేశారు.

కొత్తవలస రైల్వేస్టేషన్‌లో టికెట్ తనిఖీలు

● 330 కేసుల నమోదు, రూ.లక్ష జరిమానా వసూలు



రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ పరిధిలోని కొత్తవలస రైల్వే స్టేషన్‌లో గురువారం టికెట్ తనిఖీలు చేపట్టారు. కమర్షియల్ విభాగం, ఆర్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారితో పాటు పార్శిల్ బుకింగ్ ద్వారా తీసుకువెళ్లాల్సిన లగేజీని కోచ్‌లో తీసుకువెళుతున్న వారిపై 330 కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.లక్ష జరిమానా వసూలు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సురక్షిత ప్రయాణ పద్ధతులు పాటించాలని, చెల్లుబాటు అయ్యే టికెట్లతో మాత్రమే ప్రయాణం చేయాలని, రైలు దిగి ఎక్కే సమయంలో జాగ్రత్తలు పాటించడంతో పాటు భద్రతపై దృష్టి సారించాలని సీనియర్ డీసీఎం సూచించారు.

పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణపై హర్షం

విజయనగరం రింగురోడ్డు, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ పదోన్నతుల్లో కచ్చితంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలనే జీవో జారీపై ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకి ఇజ్రాయిల్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం మినిస్టీరియల్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని కొనియాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు మాదిగల ఉద్యోగుల సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ ప్రతినిధులు పైడితల్లి, అరసాడ రవికుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయండి

శృంగవరపుకోట, జూన్19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆదోని మండలం దానాపూర్ దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకుడు గుడిసి కృష్ణలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత బహుజన శ్రామిక్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి జయశంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్.కోటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారి పార్టీ సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల పిల్లల నిరసన

రాజాం రూరల్, జూన్19 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం తమకూ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పిల్లలు గురువారం నిరసన తెలిపారు. రాజాం మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ సమస్యల పరిష్కారం కోరుతూ గత 44 రోజులుగా చేపడుతున్న నిరసన శిబిరంలో కార్మికుల పిల్లలు పాల్గొన్నారు. కార్మిక నాయకుడు రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

అక్రమాల లెక్క తేలేనా?

(3వ పేజీ తరువాయి)

అందించలేదు. రికార్డుల్లో మాత్రం వారికి ఇచ్చినట్లుగా చూపించి నిధులు స్వాహా చేసినట్టు విమర్శలున్నాయి.

●జియ్యమ్మవలస మండలంలో 589 మందిసభ్యులకు రూ.2.25కోట్లు రుణాలుగా అందించారు.ఇందులో పీటీమండ,గౌరమ్మపేట క్లస్టర్‌పరిధిలో కొంతమందికి రుణాలు ఇవ్వకుండా స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

● పార్వతీపురంలో 515మంది సభ్యులకు రూ.2.34 కోట్లు రుణాలుగా అం దించినట్టు రికార్డుల్లో చూపిస్తున్నారు. కానీ ఈమండలంలోని డోకిశిల క్లస్టర్ పరిధిలో సుమారు రూ.పది లక్షలు లబ్ధిదారులకు అందించలేదని తెలుస్తోంది.

● కొమరాడ మండలంలో 658 మంది సభ్యులకు రూ.2.33 కోట్లను రుణాలుగా అందించారు. అయితే పూడెసు పరిధిలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● గుమ్మలక్ష్మీపురం మండలంలో 827 మంది సభ్యులకు రూ.3.34 కోట్లను రుణాలుగా అందించారు. అయితే రాయగడ జమ్ము క్లస్టర్ పరిధిలో రూ. 23 లక్షలను పక్కదారి పట్టించారనే ఆరోపణలు లేకపోలేదు. అయితే దీనిపై ఇప్పటికే అధికారులు విచారణ పూర్తి చేశారు. నిధులు స్వాహా చేసిన ఉద్యోగి నుంచి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో సదరు ఉద్యోగి నుంచి రికవరీ జరగలేదు.

● మక్కువ మండలంలో 446 మంది సభ్యులకు రూ.1.67 కోట్లును రుణాలుగా అందించారు. దుగ్గేరు క్లస్టర్ పరిధిలో రూ.పది లక్షల పక్కదారి పట్టించినా ఇప్పటివరకు ఎటువంటి చర్యల్లేవు.

● కురుపాంలో 1096 మంది సభ్యులకు రూ.3.94 కోట్లు రుణాలుగా అందించారు. అయితే నీలకంఠాపురం, గుమ్మ, వలస బల్లేరు క్లస్టర్ల పరిధిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. లబ్ధిదారులకు రుణాలు అందించకుండా కొంతమంది ఆ నిధులను స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

● పాచిపెంట మండలంలో 721 మంది సభ్యులకు రూ. 2.49 కోట్లను రుణాలుగా అందించారు. కేరంగి, కోటికపెంట, వేటగానివలస క్లస్టర్ పరిధిలో లబ్ధిదారులకు రుణాలు అందించలేదు.

చర్యలు తప్పవు..

లబ్ధిదారులకు మంజూరు చేసిన రుణాల విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్టు రుజువైతే చర్యలు తప్పవు. ప్రస్తుతం విశాఖలో ప్రధానమంత్రి మోదీ పర్యటన విధుల్లో ఉన్నా.

- సుధారాణి, పీడీ , డీఆర్‌డీఏ, పార్వతీపురం

ధర లేక దిగాలు

(3వ పేజీ తరువాయి)

ఉండేది. దిగుమతి సుంకం తగ్గించిన తర్వాత రూ.18,600 కు ధర పడిపోయింది. రానున్న రోజుల్లో టన్నుకు మరో రూ.3 వేలు తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

50 శాతం పెంచాలి

దిగుమతి సుంకాన్ని 50 శాతం పెంచి రైతులను ఆదుకోవాలి. అధిక దిగుబడి ఇచ్చే సీడ్‌ను పంపిణీ చేయాలి. మొక్కల సబ్సిడీ బకాయిలు నిధులను వెంటనే విడుదలచేయాలి. గ్రేడింగ్‌పేరుతో కర్మాగారాలు గెలలను కొనుగోలు చేయడంలేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. పార్వతీపురంలో పామాయిల్ కర్మాగారం ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- ఉదయ శేఖర్ పాత్రుడు, జనరల్ సెక్రటరీ, ఆయిల్ పామ్ రైతుల సంఘం, కురుపాం

'యోగాంధ్ర' విజయవంతం చేయాలి

పార్వతీపురంటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని, జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్వతీపురంలో జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించే యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులువేసిన యోగా చిత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు,అధ్యాపకులు రవికుమార్ పాల్గొన్నారు.

●వీరఘట్టం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):వీరఘట్టంలో ఎంపీడీవో బి.వెంకటరమణ యోగాంధ్ర కార్యక్రమంపై గురువారం సమీక్షించారు. శనివారం మండలంలోని 24 సచివాలయాల్లో యోగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు వివరించారు.

● పాలకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్రలో భాగంగా యోగా పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్- 1,2, వ్యాయామ విభాగం సిబ్బంది యోగా పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ కార్య క్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సీతారాం, వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, జూన్19(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో శనివారం యోగాను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

విశాఖకు మునిసిపల్ పారిశుధ్యకార్మికులు

పార్వతీపురంటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి):పార్వతీపురం మునిసిపాలిటీ నుంచి 50 మంది పారిశుధ్యకార్మికులు విశాఖలో శనివారం జరిగే అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమానికి గురువారంరాత్రి బయలుదేరారు. ఈసందర్భంగా కమిషనర్‌వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ పకీరురాజు ఆధ్వర్యంలో బయలు దేరారు.

షట్టర్లకు మరమ్మతులు చేయాలి

పాలకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి):తోటపల్లి ఎడమ,కుడి ప్రధానకాలువల షట్టర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులుచేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. గురువారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ తోటపల్లి పాత బ్రిడ్జి వద్ద కుడి,ఎడమ కాలువల షట్టర్లను శుక్రవారం పరిశీలించనున్నట్లు తెలిపారు.

గరుగుబిల్లిలో జైగురుదత్త హోమాలు

గరుగుబిల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):గరుగుబిల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం జైగురుదత్త హోమాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన యజ్ఞ యాగకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ సహకారంతో అనగాదేవి సహిత జైగురుదత్త హోమంచేశారు.

తోటపల్లి కాలువల్లో పూడికల తొలగింపు

గరుగుబిల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):తోటపల్లి పాత బ్యారేజీ పరిధిలోని కుడి, ఎడమకాలువల ద్వారా ఆయకట్టుకు ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.కాలువల్లో పూడికల తొలగింపుపనులు ప్రారంభించారు.కొత్తూరు నీటిసంఘం పరిధిలో నాలుగు పనులకు రూ.7.08 లక్షలు,రావివలసకు సంబంధించి నాలుగుపనులకు రూ.8.45 లక్షలు, కొత్తపల్లి పరిధిలో రూ.6 లక్షలకుపైగా నిధులు మంజూరుచేశారు. ఈ మేరకు రావుపల్లి పరిధిలో సర్పంచ్ బొంతాడ మహేష్ పనులు ప్రారంభించారు.

విపత్తులపై మాక్‌డ్రిల్

రాయగడ, జూన్19(ఆంధ్రజ్యోతి):రాయగడ, బిసమ్‌కటక్, గుణుపూర్ సమితుల్లో ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా రాయగడ సమితి సంతశేసికల్‌లో బీడీవో సుజిత్‌కుమార్ మిశ్రా, ఏబీడీవో కాలుచరణ్ నాయక్, వరదశిబిరం ఎడిటర్ పి.సుధీర్‌కుమార్ మాక్‌డ్రిల్ చేపట్టారు.తుఫాన్ ప్రభావితప్రాంతాల్లో ప్రజలకు అందాల్సిన రక్షణ, వరద ప్రాంతాల్లో ప్రజలను రక్షణ శిబిరాలకు తరలించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిమిడిపేట ప్రాథమిక ఆసుపత్రి డాక్టర్ సునీల్ ప్రసాద్ మహాపాత్ర, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గౌడకిలిమి గుడలో చట్టాలపై అవగాహన

రాయగడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి):గౌడకిలిమి గుడలో జిల్లా న్యాయ సేవా విభాగం చైర్మన్, న్యాయాధికారి సత్యనారాయణ షడంగి ఆదేశాల మేరకు న్యాయసేవా విభాగం కార్యదర్శి సుబ్రత ఆచార్య అధ్యక్షతన గురువారం ప్రజలకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆచార్య మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన చేసుకుని న్యాయ సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది దేవరాజ్ నాయక్ పాల్గొన్నారు.

షెడ్లు లేక.. చెట్ల కింద

● కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం ● ఇదీ దుగ్గేరు, నంద సంతల్లో పరిస్థితి

దుగ్గేరు, నంద వారపు సంతలు సమస్యలకు నిలయంగా మారాయి. ప్రధానంగా షెడ్లు ఏర్పాటుచేయకపోవడంతో చెట్ల కిందే క్రయ విక్రయాలు నిర్వహించాల్సివస్తోంది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో క్రయ విక్రయదారులు అవస్థలకు గురవుతున్నారు.



నందలో రహదారి పక్కన వారపు సంత నిర్వహిస్తున్న దృశ్యం

మక్కువ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గేరు, నంద గిరిజన ప్రాంతాల్లో గల వారపు సంతల్లో సమస్యలు పాగావేశాయి. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో సంతకు వచ్చే క్రయవిక్రయదారులు ఇబ్బందిపడుతున్నారు. మక్కువ తదితర మండలాల్లో ని గిరిజనులు అటవీ ఉత్పత్తులు విక్రయించేందుకు, అవసరమైన నిత్యా వసర సరుకులు కొనుగోలుకు వారపు సంతలు వేదికలుగా మారాయి.

రవాణా సదుపాయాలు లేకపోయినా...

దుగ్గేరులో గురువారం జరిగే సంతకు బాగుజోల, చిలక,ఎగువ, దిగువ మెండంగి, సిరివర, తాడిపుట్టి తదితర కొండశిఖర గ్రామాల్లో నుంచి 100 మంది వరకు గిరిజనులు సేకరించిన ఉత్పత్తులు తీసుకొస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలుదారులతోపాటు 30 మంది వరకూ వ్యాపారులు వస్తారు.శనివారం జరిగే నంద సంతకు ఆంధ్ర- ఒడిశా బోర్డర్ పరిధిలో గల లొడ్డ, తదితర గ్రామాల నుంచి 150 మంది వరకు గిరిజనులు సేకరించిన ఉత్పత్తులు విక్రయానికి తీసుకువస్తా రు. గిరిశిఖర గ్రామాల్లో సేకరించిన అటవీఉత్పత్తులను రవాణా సదుపా యాలు లేకపోయినా గిరిజనులు వ్య యప్రయాసలు పడి సంతలకు తీసుకొ స్తుంటారు. వీరి నుంచి మైదాన ప్రాం తాల నుంచి వ్యాపారులు, వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారు.

దళారులకు తక్కువ ధరకు...

సంతల్లో షెడ్లు నిర్మించకపోవడంతో ఎండకు ఎండి, వర్షానికి తడిచి క్రయవిక్రయాలు చేయాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. ఐటీడీఏ అధికారులు వారపు సంతల్లో షెడ్లు ఏర్పాటు చేయడంతోపాటు సదుపాయాలు కల్పించాల్సిఉంది. అయితే అధికారులు సంతల్లో సౌకర్యాలకల్పనపై దృష్టి సారించకపోవడంతో గిరిజనులు మహిళలు, పిల్లలతో కలిసి చెట్లకింద లావాదేవీలు నిర్వహిస్తున్నారు. పండించిన, అడవుల్లో సేకరించిన ఉత్పత్తులను ఐటీడీఏ కొనుగోలు చేయకపోవడంతో దళారులకు తక్కువ ధరకు విక్రయించాల్సివస్తోందని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు సంతల్లో షెడ్లు ఏర్పాటు చేయాలని, పంట ఉత్పత్తులను అమ్మడానికి దళారుల బారిన నుంచి కాపాడాలని, నాణ్యమైన వస్తువులు అమ్మేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అలజడి సృష్టించేందుకు జగన్ కుట్ర

●శవరాజకీయాల చేయడం జగన్‌కు అలవాటు: మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా వేడుకల సమయంలో రాష్ట్రంలో అలజడి సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు మాజీ సీఎం జగన్ కుట్ర చేస్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆరోపించారు. శవ రాజకీయాలు చేయడం, రాజకీయ ముసుగులో కుట్రలకు పాల్పడడం జగన్‌కు బాగా అలవాటేనన్నారు. గురువారం ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ శవరాజకీయాల కోసం వచ్చి ఇద్దరిని శవాలుగా జగన్‌రెడ్డి మార్చారని విమర్శించారు. చంపడం, పరామర్శించడం జగన్‌కు అలవాటేనన్నారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటే ఆ పాపం టీడీపీపై వేస్తున్నారన్నారు. ఏడాది కిందట చనిపోతే ఇప్పుడు పరామర్శకు వెళ్లడమే పెద్ద నాటకమన్నారు.అధికారంలో లేకపోతే ఇంతలా బహిరంగంగా నరుకుతాం, చంపుతాం, తొక్కిపడేస్తామని జనాల్ని బెదిరిస్తారా అని ప్రశ్నించారు.ర్యాలీలో వాహనండీకొని ఒకరు, తోపులాటలోఇంకొక వైసీపీ కార్యకర్తలు చనిపోతే కనీసం పట్టించుకోలేదన్నారు.ఖాళీ అవుతున్న వైసీపీని కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు.పరామర్శలు ప్రజలకోసమే అయితే అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలు లేవనెత్తావచ్చుకాదా అని ప్రశ్నించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

● ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బందులు రానివ్వబోమని చెప్పారు. గురువారం మండలంలోని తురకనాయుడువలస ఎస్సీవీధిలో యువకులు శ్రమదానంతో నిర్మించిన రచ్చబండ ప్రారంభించారు.అనంతరం తురకనాయుడువలస, పెదకుదమ గ్రామాల్లో రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు,పచ్చిరొట్టవిత్తనాలు, ఎరువుల సబ్సిడీపై ప్రభుత్వంఅందిస్తోందని, రైతులకు ఇబ్బందులు రానీయకుండా వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్,టీడీపీ మండలాధ్యక్షులు పల్ల రాంబాబు,ట్రైబల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు నందివాడ కృష్ణబాబు, వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మూడడ్ల సత్యంనాయుడు, వైస్ చైర్మన్ ఎం.ప్రసాద్, డంగభద్ర సర్పంచ్ జోగి భుజంగరావు,సర్పంచ్ పోతల నాగమణి పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

బెలగాం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. గురువారం పట్టణంలో ఆసుపత్రి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి పనుల గురించి అడిగితెలుసుకున్నారు.పనుల్లో నాణ్యతలోపం లేకుండా త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత జిల్లా ఆసుపత్రిలో ఆకస్మికంగా తనిఖీచేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు.కార్యక్రమంలో వైద్యాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'అమృత్‌సరోవర్'తో చెరువుల అభివృద్ధి

పార్వతీపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):అమృత సరోవర్ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. గురువారం మండలంలోని నర్సిపురంలో అమృత సరోవర పథకం ద్వారా చేపడుతున్న చెరువుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపీవో కృష్ణారావు, ఈసీ కృష్ణారావు పాల్గొన్నారు.



బెలగాం: ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

జగన్నాథ రథయాత్రకు ఏర్పాట్లు



రథాన్ని సిద్ధంచేస్తున్న దృశ్యం

పాలకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):పాలకొండలో ఈనెల 27 నుంచి జరిగే జగన్నాథస్వామి రథయాత్రకు అధికారులు ఏర్పాటుచేస్తున్నారు. జగన్నాథస్వామి ఆలయ అధికారులు, పలుశాఖల సిబ్బంది పరిసరాల్లో గుంతల పూడ్చివేత, పరిసరాల్లోని పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టారు. రథాన్ని బయటకుతీసి రంగులువేయడంతోపాటు మరమ్మతులను ప్రధానఅర్చకులు కృపాసింగ్‌దాస్ తదితరులు చేయిస్తున్నారు.రథయాత్రలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ అధికారులకు కోరారు. ఈమేరకు ఏర్పాట్లపై గురువారం పలుశాఖల సిబ్బందితో జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో మాట్లాడారు. కాగా పాలకొండలో జగన్నాథ రథయాత్రను పురస్కరించుకొని జెయింట్ వీల్, ప్రసాదం కౌంటర్ తదితర నిర్వహణ కోసం గురువారం వేలంపాట ఖరారుచేశారు. ఈ మేరకు బాలకృష్ణ అనే వ్యక్తి మూడు లక్షల 82 వేలకు పాటను దక్కించుకున్నారు. ఈనెల 27 నుంచి జూలై ఏడో తేదీ వరకు జరగనున్న రథయాత్రలో జెయింట్‌వీల్, ప్రసాదం కౌంటర్లు తదితర కార్యక్రమాల నిర్వహణకు పాట ఖరారైనట్టు ఆలయ ఈవో సర్వేశ్వరరావు తెలిపారు.

కార్పొరేట్ల కోసమే కార్మిక చట్టాలు రద్దు

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు



మాట్లాడుతున్న రమణారావు

పాలకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలు, కమిషన్లకోసం రద్దు చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆరోపించారు. గురువారం పాలకొండలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి. అమరవేణి అధ్యక్షతన పాలకొండ మండల సీఐటీయూ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లు రద్దయ్యే వరకూ పోరాడుతామని తెలిపారు. జూలై 9న జరిగే సమ్మెను జయప్రదం కోసం ఈనెల 25న పాలకొండలో పాతబస్టాండ్ వద్ద జీపుజాతా ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఎడ్ల శ్రీనివాసరావు, గోవిందరావు, సంజీవి, కాద రాము, జెస్సీబాయి, శారద, శ్రీదేవి, చిట్టెమ్మ, కమల, బుజ్జి, లలిత పాల్గొన్నారు.

పని భారాన్ని తగ్గించాలి

●ఎస్‌డబ్ల్యూఎస్ పార్వతీపురం డిపో కార్యదర్శి తాతబాబు



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎస్ సంఘ సభ్యులు

పార్వతీపురంటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెంచిన పనిగంటల భారాన్ని తగ్గించాలని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎస్ పార్వతీపురం డిపో కార్యదర్శి తాతబాబు కోరారు. గురువారం పార్వతీపురం ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎస్‌డబ్ల్యూఎస్ తోపాటు సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంబంధించి 8 నుంచి 10 గంటల వరకూ పని దినాన్ని పెంచడం వల్ల వారి శ్రమను దోపిడీ గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.లేబర్‌కోడ్లు రద్దు చేయాలని, జీవో- 70లో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని, కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు. డ్రైవర్, కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని, మహిళలకు నైట్‌షిఫ్ట్‌లో డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం తొమ్మిదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.విష్ణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కడకెళ్ల ఫీడర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్లు తొలగించనుండడంతో నడుకూరు, కిమ్మి, చిట్టిపుడివలస, వి క్రంపురం, కంబరవలస, కంబర, నడమికెల్ల, కడకెల్ల తదితర గ్రామాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఐటీఐలో మిగులుసీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్,జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐలో ప్రవేశాలకు మిగులుసీట్లకు సంబంధించి రెండోవిడత కౌన్సెలింగ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు వచ్చే నెల 17లోగా తమ నమోదు యునిక్ నంబర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోనైనా వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అలాచేసుకున్న వారి పేర్లు మాత్రమే మెరిట్‌లిస్ట్‌లో నమోదవుతాయని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు వచ్చే నెల 21న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సీతంపేట ప్రభుత్వ ఐటీఐకు హాజరుకావాలని సూచించారు.

సుపరిపాలనపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారిస్తోందని మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు తెలిపారు.గురువారం గరుగుబిల్లిలో వికసిత్ భారత్, అమృత్ కాలం, సేవ సుపరిపాలన, సంక్షేమ పాలనకు 11 సంవత్సరాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్టీలకతీతంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.కార్యక్రమంలోజిల్లా మహిళా మోర్చాఅధ్యక్షురాలు చంద్రమ్మ,పి.అశోక్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఏవోగా సూర్యప్రకాష్

బాడంగి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బాడంగి ఏవోగా గొడ్డ సూర్య ప్రకాష్ గురువారం విధుల్లో చేరారు. పాడేరు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడకు ఏవోగావచ్చారు. ఇక్కడ ఏవోగా విధులు నిర్వహించిన కె.శిరీష సాలూరు మండ లానికి బదిలీపై వెళ్లారు.

అంతర పంటలతో అధిక దిగుబడి

● సుగంధ ద్రవ్య పంటల ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రసాద్

పాచిపెంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర పంటలతో అధిక దిగుబడి సాధించడంతోపాటు రైతుల ఆర్థికాభివృద్ధి జరుగుతుందని సుగంధ ద్రవ్య పంటల ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ డి.ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని గోగాడవలసలో సులీల ఆగ్రో ఫామ్స్ వద్ద రైతులకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు.రైతు చలసాని లీలాప్రసాద్ తోటలో క్షేత్రస్థాయిలో రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు ఏయే తోటలు అంతర పంటలుగా వేయాలో వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త లిజో థామస్, శాస్త్రవేత్త డాక్టర్ నిస్సార్‌లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందికి శిక్షణ

పార్వతీపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలోని పెడంకలం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. గురువారం పార్వతీపురం ఎన్‌జీవో హోంలో వైద్య ఆరోగ్య శాఖ అదనపుసంచాలకులు అనీల్‌కుమార్, వరల్డ్ శాఖ అదనపు సంచాలకులు అనీల్‌కుమార్ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ బృందంతో కలిసి ఆర్‌సీహెచ్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతి, నారాయణ, ఎం.వినోద్ కుమార్, టి.జగన్మోహన్‌రావు, రఘు, సన్యాసిరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఫాంపాండ్లు పూర్తికావాలి

జియ్యమ్మవలస, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):ఫాంపాండ్లు నిర్మాణం నెలాఖరులోగా పూర్తికావాలని ఉపాధి హామీ పథకం ఏపీవో ఈగల తులసీదాస్ కోరారు. గురువారంపెదబుడ్డిడిలో ఫాంపాండ్ల పనులను పరిశీలించారు.ఆయన వెంట వి.వరహాలునాయుడు ఉన్నారు.

అతిసారపై అవగాహన అవసరం

బలిజిపేట,జూన్ 19(ఆంధ్రజ్యోతి):అతిసారపై అవగాహన అవసరమని పీహెచ్‌సీవైద్యుడు కాంత్రికిరణ్ తెలిపారు. గురువారం బలిజిపేటలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు వయస్సు గల వారికి సంబంధించి డయేరియా మరణాలు సంభవించకూడదన్నారు. ఈనెల 31 వరకూ జూలై 31 వరకు రెండు నెలలు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మక్కువ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగాఉండాలని ఎస్ఐ వెంకటరమణమూర్తి కోరారు.స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి, గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈగల్ బృందం, నార్కోటిక్స్ సెల్ జిల్లా ఇన్‌చార్జి పి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.